# భగవద్గీతలో సర్వమత సమన్వయము



శ్రీమతి సి. పద్మావతి,
తిరుపతి.

పుణ్యస్య ఫలమిచ్ఛంతి
పుణ్యం నేచ్ఛంతి మానవాః
నపాప ఫలమిచ్ఛంతి
పాపం కుర్వంతి యత్నతః.

మానవులు పుణ్యకార్యాలు చేయుటానికిష్టపడరు కానీ పుణ్యఫలాసక్తులగుచున్నారు. పాప ఫలితాన్నాశించరు; కానీ పాప కార్యాలను ప్రయత్న పూర్వకంగానే చేస్తారు.

ఈ శ్లోకమందలి మానవ నైజము సమస్త మానవులకు వర్తించును. ఈ పాప పుణ్య కర్మ భావనలు మాత్రం దేశ కాలానువర్తినియై యున్నవి. ఖండ ఖండాంతరముల మానవులకూ వర్తించునిది.

భగవద్గీత హిందువుల మత గ్రంథమన్న మాట ఆధునికమైనది. గీతాసుధామృతము సమస్త మానవాళికీ ఉద్దేశింపబడినది. పరమత ద్వేషాగ్నికీ గ్రంథరాజము శాంతి సుధ వర్షించగలదు; ఆధునిక మత మౌఢ్యమునకు, ప్రాక్పశ్చిమల కలయికవల్ల ఏర్పడ్డ యుగ సంధి జన్య దుష్కృతాలకీ గీతా బోధ దివ్యమైన చికిత్స.

గీతా బోధ జరిగింది కూడా పరస్పర వైషమ్యాల సమన్వయమునకే నని గ్రహింపగలరు. శ్రీకృష్ణుడు తన దివ్య జీవనమందు మూడు గీతలకు ప్రసిద్ధిచెంది యున్నారు. బాల్యమందలి వేణుగానం గీతాగానమై భక్తి భావనా ఝరికి మూలస్రోతమైనది. రెండవ గీత కృష్ణ పరమాత్మ 80 వ ఏట రణరంగమందు అర్జునుని వ్యాజముగాగొని సమస్త మానవాళికై చేసినది; మూడవగీత యుగావతారమైన కృష్ణులకు దాదాపు 120 సంవత్సరములు నిండిన వేళ దేవతలందరూ ద్వారకానగరి కరగి తాము వచ్చిన అవతార కార్యమైన ధర్మ సంస్థాపన జరిగి పోయిందనీ వైకుంఠమునకు తరలి రావలిసిందనీ ప్రార్థించారు. అట్టి తరి ఉద్ధవుడు కన్నీరు మున్నీరుగా విలపింప ఏకాంతమున తన ప్రియ సఖునకు చేసిన బోధ ఉద్ధవగీతగా ప్రసిద్ధి గాంచినది.

## గీతాబోధయొక్క ఆవశ్యకత:

ద్వాపర యుగాంతమున కర్మకాండ ప్రబలి భగవత్ప్రేమ సన్నగిల్లినది. కలిదోష నివారణగావలెనన్న వినూత్న మార్గమందు భక్తి జ్ఞానాదుల బోధ జరగాలి. రాజు సౌధమునుండి రైతువరకు భగవత్ప్రాప్తి పొందగల సులభమార్గం అవసరమైయున్నది. యజ్ఞయాగాదుల కర్మకాండ ప్రబలి అందలి అంతరార్థము లుప్తమై పోయినది. ఆనాటి మహాభారతయుద్ధ బీజములే నేటి ప్రపంచ యుద్ధములకు కారణభూతములై యున్నవి. నాడు అన్నదమ్ములమధ్యగల ఈర్ష్యా ద్వేషాలు నేడు దేశ దేశములకు వర్తించి అణు యుద్ధములకు దారి తీయుచున్నవి. అహంకార మమకారాలు మదమాత్సర్యాలు నివారించలేక పోవడానిక్కారణం హృదయ దౌర్బల్యం అని శ్రీ కృష్ణపరమాత్మ హెచ్చరిక ఈ విధంగా వున్నది.

క్లైబ్యం మాస్మగమః
పార్థ నైతత్త్వయ్యుప పద్యతే



## రచయిత (త్రు)లకు
# ముఖ్య గమనిక

- ★ చాలామంది రచయితలు సప్తగిరికి తమ రచనలు పంపుతున్నారే తప్ప స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవరు జత చేయటం లేదు.
- ★ దీనివల్ల సప్తగిరి ప్రచురణకు అంగీకరించని రచనలను త్రిప్పి పంపడానికి సాధ్యం కావడంలేదు. మాకు చాలా ఇబ్బంది కలుగుతోంది. అదే విధంగా రచన ప్రచురణ విషయం తెలియక రచయితలు కూడ ఇబ్బందికి గురి అవుతున్నారు.
- ★ కావున ప్రతి రచయిత తమ రచనతోపాటు స్టాంపులు అంటించిన స్వంత చిరునామాగల కవర్లు తప్పనిసరిగా జతచేయాలని కోరుతున్నాము.
- ★ మన దేవాలయాలు శీర్షికకు రచనలు పంపేవారు తప్పనిసరిగా ఫోటోలు జతచేయాలి. లేనిచో రచన పరిశీలింపబడదు.

**సంపాదకుడు**

క్షుద్రం హృదయ దౌర్బల్యం
త్యక్త్వోత్తిష్ఠ పరం తప.

ఈ 'క్లైబం' ఈ 'దౌర్బల్యం' ఎన్నో క్షుద్ర రూపాల్లో నేడు జన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఆనాడు ఒక అర్జునునికే 'కార్పణ్య దోషం' అయితే నేడు దేశ దేశాలు ఈ దోషంలో మునిగి తేలు తున్నాయి. అర్జునుడు చివరకు ''శాధి మాం త్వాం ప్రపన్నం'' అని చతికిలబడ్డాడు. నేడు దేశాధి నేతలు తమ తమ మత గ్రంథాలలోని మంచినే శరణుపొందాలి. ఇక గీతలో రెండవ అధ్యాయపు 11 వ శ్లోకం నుండి నిజమైన బోధ ప్రారంభమగును. ఈ తత్త్వ బోధ కేవలం అర్జునునికే కాదు. భవిష్య మానవాళి కుపయుక్తమైన గొప్ప సైద్ధాంతిక తత్త్వమిది. సర్వ జీవుల హృదయాల్లో నెలకొన్న మానసిక వైకల్యానికి చికిత్స, రాజ్యాధినేతలైతే వారికి ధర్మసంరక్షణా భారపు మార్గ దర్శనానికీ బోధ; వ్యష్టి సమిష్టి రెండువిధాలైన జీవితాల లోను ఆధ్యాత్మికత పేర వెర్రితలలు వేసినపుడు మహాత్ముల ఆవిర్భావం ఉపదిష్టము. గీతలోని ప్రథమ షట్కము కర్మ యోగముగా, ద్వితీయ షట్కం భక్తి యోగముగా, తృతీయ షట్కంపై రెండింటి సమ్మేళనముచే ప్రభవించు జ్ఞాన యోగముగా పరిఢవిల్లినవి.

ప్రపంచములోని సర్వధర్మములకు మతములకు పై మూడింటిలో ఏదో యొక యోగము మూలమై యున్నది. ఏకేశ్వరో పాసనగానీ, సమూర్త్యోపాసనగానీ, అమూర్త్యో పాసనగానీ కర్మభక్తి జ్ఞాన సమన్వితమై యున్నవి. యోగం అన్న పదానికిగీతాచార్యులు విస్తృతమైన అర్థాన్ని ప్రసాదించి యున్నారు. ఈ పదం 'యుంజ' ధాతువు నుండి నిష్పన్న మైనది. గీతాబోధ యంతయు కర్మ సాధనకే గానీ కర్మయోగం నుండి సన్య సించడానికి పలాయనం చిత్తగించ డానికి కానే కాదు. కర్మ చేయుటలో బుద్ధి నుపయోగించి చేయుట అను గొప్ప సందేశం సర్వులకూ సులభముగా నుండునట్లు తెలిపినారు.

కర్మ సిద్ధాంతములోని విశిష్టత, ఏ ఇతర ధర్మ గ్రంథాల్లోను లేని గొప్ప సిద్ధాంతం ఫలాభి సంధిరహిత కర్తవ్య నిష్ఠ. గీతాచార్యుని ప్రధాన బోధ ఇదే:

''కర్మణ్యే వ్యాధికారస్తే
మాఫలేషు కదాచన
మా కర్మ ఫల హేతుర్భూః
మాతే సంగో స్త్వ కర్మణి''.

(కర్మ చేయుట యందే అధికారం కలదు కానీ ఫలం ఆశించడంలో అధికారం లేదు. అట్లాగని కర్మనిష్ఠను వదల కుండుము) ఈ కర్మ సిద్ధాంతములోని సత్యము సర్వ జన సర్వకాల సర్వదేశములకు వర్తిస్తుంది. ఇట్టి కర్మ సిద్ధాంతమే మత గ్రంథమందునూ కానరా దనుట నిర్వివాదము. ఇట్టి సిద్ధాంతము ఆచరణ యోగ్యమా అన్న సందేహమువసరమే లేదు. అరవింద యోగీంద్రులు రాజకీయాల నుండి విరమించి జైలులో కృష్ణ సాక్షాత్కారం బొంది కర్మయోగపురహస్యాలను మానవాళి కందించిన కలియుగ ఋషి.

### శంకరాచార్యుల సమన్వయము

ఈ సాంఘిక ఆధ్యాత్మిక సమన్వయ శక్తి భారతీయ జీవితంలో యొక భాగమై యున్నది. సమన్వయం లోపించినపుడు వైతాళికుల ఆవిర్భావం జరుగుచున్నది. గీత ఉపనిషత్తులు వేద విజ్ఞానం నుండి పరంపరాగతంగా వస్తున్న సమన్వయ భావం శంకరాచార్యులవారి సమన్వయస్ఫూర్తి హైందవ సమాజాన్ని తీర్చి దిద్దినది. గీతలోని సమన్వయమే శంకరాచార్యులవారి గళంలో నినదించి హైందవ సమాజమునకు పదనిర్దేశం చేయగల్గింది. ఆచార్యుల వారెవ్వరి మతాన్ని ఖండించలేదు. పరమేశ్వర అస్తిత్వాన్ని అంగీక రించని సాంఖ్య దర్శనము, చార్వాకాది నాస్తిక మతములు, వేదము నంగీకరించని తాంత్రికో పాసనలు, వీటన్నింటినీ ఉపేక్షించి సీదా సాదా మార్గమైన బౌద్ధమతావలంబులు - ఇవన్నియు వేదమార్గములోని సత్యాన్ని సమన్వయ

పరచలేక జన జీవనానికి దూరం కాసాగినవి. హైందవ ధర్మానికి గ్రహణం పట్టిన సమయ మందు మహాతేజోరాశియై చేతిలో దండ ములో కాషాయంబరధారియై వేదమార్గమే తానైన శంకరులు ఆవిర్భవించారు. కకావికలైన హైందవ శాఖలన్నిటికీ బ్రహ్మ భావ నేమూల మని ఘంటాపథంగా వెలుగెత్తి చాటినారు.

బ్రహ్మ సత్యం జగన్మిథ్య
జీవో బ్రహ్మైవ నా పరః.

అన్న బ్రహ్మ బోధ దేశం మారు మూలల్లోను ప్రతిధ్వనించింది. ప్రతి ఊరు గుడిలోని ఉపాసనారీతుల నుద్ధరించి సామ్యము నేర్పరిచిరి. పలు శాఖలు ధర్మములు బ్రహ్మభావనకు విరుద్ధము కావనియు అవన్నియు సాపేక్షకములని ఋజువుచేసి కర్మనిష్ఠకు ప్రాధాన్య మిచ్చి యున్నారు. జీవాత్మ పరమాత్మల ఐక్యమే పరబ్రహ్మానుసంధానమని, సర్వ మతాల పరమార్థమిదియే యని సమన్వయపరచిన మహామహులు శంకరులు. జ్ఞాన మార్గానికి ప్రాధాన్యమిస్తూనే, సాధారణ జనవాహినిలోని హృదయ జ్యోతిని జాగృతం చేయడానికి భక్తి మార్గాన్ని వివిధ పూజాపద్ధతుల ద్వారా సంస్కరించిన ఘనత ఆచార్యులకే దక్కింది. శంకరులవారి సమన్వయ వాదానికి మూలం భగవద్గీతలో దర్శించగలము.

## భగవద్గీతలో సమన్వయము

శంకరుల అద్వైతవాదమందు వివిధ మతముల సారం ఇమిడియున్నది. గీతా చార్యుని వాణిలో సర్వమతములకు ఫలము నిచ్చువాడు భగవానుడే నన్నది స్పష్ట పరిచారు.

''యోయో యాం యా తనుంభక్తః
శ్రద్ధయా ర్చితు మిచ్ఛతి
తస్యతస్యాచలాం శ్రద్ధాం
తామేవ విద ధామ్యహమ్''

కామై స్తైస్తైః హృత జ్ఞానాః
ప్రపద్యంతే న్య దేవతాః
తంతం నియమ మాస్థాయ
ప్రకృత్యా నియతాస్స్వయా.

(ఎవరెవరే రూపంలో నన్ను అర్చించు దురు వారి శ్రద్ధను బట్టి ఫలము నిచ్చు వాడను నేనే.)

(వాసనా జన్య గుణములవల్ల కామ్య వస్తువులు కోరుకుందురు. ఈ కోరికల వల్లనే సంబంధమగు జ్ఞానము తొలగి పోవును. అందువలన ఇతర దేవతామూర్తుల నారాధించి తృప్తి పొందుచూ ఆ యుపాసనారీతులనే పాటించుచున్నారు).

గీతాచార్యుని నిర్దేశించిన ఇట్టి సమన్వయమే శంకర భగవత్పాదుల అద్వైత మన్న పేరుతో కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు కథియవాడనుండి ఒరిస్సా కటకం వరకు ఆధ్యాత్మిక భేరి మోగించిరి. భూ మండలమందు వర్థిల్లిన వర్థిల్ల బోవు మతములన్నియు కర్మ, భక్తి, ధ్యాన మార్గములలో నెద్దియో ఒక యోగము ననుసరించి పరిఢవిల్లుచున్నవి. పరమత తిరస్కార దూషణాదులు వేద విజ్ఞాన విరుద్ధములైనవి. గీత సర్వోపనిషత్తుల సార సంగ్రహముగాన విపరీత ధోరణులెచ్చట కానరావు. 'స్వయం నారాయణేన కథితం' గాన గీతలో విశాలమైన సమన్వయ దృష్టిచే భగవానుడు ఏ రూపములో అర్చించి యుపాసించినా ఫలితమునిచ్చువాడను నేనే అని ఘంటా పథముగా చెప్పియున్నారు. ప్రపంచములోని ఏ మత గ్రంథమైనా పరికించిన ఇట్టి విశాలమైన సమన్వయ భావము కానరాదు; అంతియేగాక ఈ మత గ్రంథము లందు భక్తి యోగంలో ఉద్ఘాటించిన 35 ముప్పది యైదు (అద్వేష్టా సర్వభూతానాం నుండి 19 వ శ్లోకంవరకు) ఏ సద్గుణ సాత్త్విక గుణములు వివరింపబడినవో వానిలోని ఏ కొన్ని సత్త్వ గుణములలో ప్రధానమని ఘోషించని మత గ్రంథమే లేదు. ఈ 35 గుణములలో కనీసం ఎనిమిది సుగుణముల ననుష్ఠించినా నరుడు నారాయణుడు కాగలడు. సమస్త మతముల సారమే సద్గుణ సంపద. ఇదే పురుషుణ్ణి పురుషోత్తముని చేయగలడని అట్టి సత్త్వ గుణ ప్రధానుడే తన కిష్టుమనియు స్వయముగా కృష్ణపరమాత్మ అభయ ప్రధాన రూపముగా నొక్కి చెప్పియున్నారు.

## గీతాచార్యుడు గొప్ప మానసిక తత్త్వవేత్త

ఆధునిక యుగమందు ప్రఖ్యాతి గాంచిన మానసిక శాస్త్రజ్ఞులు మానవుని ప్రాకృతిక గుణములను దాదాపు 14 విభాగాల క్రింద విభజించియున్నారు. ఈ మూల ప్రకృతే వారి వారి శారీరక, మానసిక, మనో స్థాయిల ననుసరించి పనిచేయుచున్నవని తెలిపిన విషయాలను గీతాచార్యుడు గుణ త్రయ విభాగయోగములో ప్రతి దానికి మూడు స్థాయిలున్నవని అవి సత్త్వ రజ స్తమో గుణములని విపులముగా స్పష్టం చేసి యున్నారు. ఇదే మనుజుని ప్రతి కర్మయందు ప్రతి ఫలించుచున్నవని తేట తెల్లముగా తెలిపిన మహా మానసిక తత్త్వవేత్త గీతాచార్యుడు.

ఇంతియేగాక కర్మవిరతుడైన అర్జు నుని క్రమానుగతముగా కర్మ ప్రాముఖ్యత, ఆత్మ తత్త్వము జ్ఞానోపలబ్ధి అన్న ఒక్కొక్క మెట్టు పైనుంచి తీసి కెళ్లి యోగా రూఢుని స్థితి వివరించియున్నారు. ఇదంతయు గుప్తముగా నున్న మానసిక చికిత్సయేగానీ వేరొండుగాదు. చివరకు 'కార్పణ్య దోషం' హరింపజేసి, ''కరిష్యే తవ వచనం'' అన్న స్థాయికి గొని వచ్చినారు. ఈనాడు దేశాలన్నీ ఇట్టి ''కార్పణ్య దోషం'' లో మునిగి తేలుతున్నాయి. ప్రతిదేశపు మత గ్రంథము లోనూ గల సత్త్వ గుణ సంపద నాశ్ర యించి తద్వతిరేక ధోరణులను పాలకులు నివసించాలి ప్రజను సద్వర్తనులను చేయ గలగాలి. అపుడే శాంతి సాధన, వసుధైక కుటుంబము అన్నవి సాధించగలరు.